పెండింగ్ పనులు పూర్తి చేయాలని వినతి

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, మొబిన్

మెహిదీపట్నం ఆగస్టు 21: ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగంగా పూర్తి చేయాలని కార్వాన్, బహదూర్‌పుర ఎమ్మెల్యేలు మహ్మద్ కౌసర్‌మొహినుద్దీన్, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని కోరారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌తో వారు సమావేశమయ్యారు. కార్వాన్, బహదూర్‌పుర నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, పనులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. స్పందించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో ప్రత్యేక హక్కులకు నష్టం

ముషీరాబాద్, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ ఉపకులాల వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలో ఎస్సీ, ఎస్టీలకు పొందుపరిచిన ప్రత్యేక హక్కులకు తీవ్ర నష్టం కలిగిస్తుందని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కోకన్వీనర్ జంగా శ్రీనివాస్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ భారత్‌బంద్‌లో భాగంగా బుధవారం ముషీరాబాద్ డిపో ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. బస్సులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆందోళనకారులను అరెస్టుచేశారు. నాయకులు పి.లోకేశ్వర్‌రావు, తిరుమల్‌రావు, ఎం.భానుప్రసాద్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

- ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్ ఏసీపీ శంకర్ రాజు

గోషామహల్ సీటీసీలో ట్రైనీ పోలీసులకు రోడ్డు ప్రమాదాలు, నివారణపై అవగాహన కల్పించిన ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్ ఏసీపీ శంకర్ రాజు

సుల్తాన్‌బజార్, ఆగస్టు 21 : రోడ్డు ప్రమాదాల నివారణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి రహదారులపై విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ బేగంపేట్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ శంకర్ రాజు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం గోషామహల్ సీటీసీలోని పోలీస్ ట్రైనీ విద్యార్థులకు, సిబ్బందికి 'రోడ్డు ప్రమాదాలు-నివారణ' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని అన్నారు. అత్యధికంగా యువత ఓవర్ స్పీడ్,రాంగ్ రూట్,సిగ్నల్ జంపింగ్,సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తున్నారని అన్నారు. సిగ్నల్ జంపింగ్ అతి ప్రమాదకరమని, ప్రధానంగా రెడ్ సిగ్నల్ పడిన సమయంలో తప్పనిసరిగా వాహనం ఆపాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా డ్రైవింగ్ చేస్తే 5 వేల జరిమానాతో పాటు 3 నెలల జైలు శిక్షను కూడా విధిస్తారని వివరించారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు. అదేవిధంగా రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని అన్నారు. వాహనాలు నిర్లక్ష్యంగా నడపడం ప్రమాదకరమని అన్నారు. హీరో మోటర్ కంపెనీ ప్రతినిధి శ్రావణ్‌కుమార్ ట్రైనింగ్ పోలీస్ విద్యార్థులకు హెల్మెట్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ విక్రమ్‌దేవ్, ఆర్ఐ నరసింహామూర్తితో పాటు 315 మంది పోలీస్ ట్రైనీ విద్యార్థులు, సీటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

ఎమ్మెల్యే వెంకటేశ్‌కు వేంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేస్తున్న శ్రీ విద్యాధీశతీర్థస్వామి

కాచిగూడ, ఆగస్టు 21: ఆధ్యాత్మికత వాతావరణంలో ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం స్వామి వారు కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి అవతారంలో కాచిగూడ లింగంపల్లిలోని బృందావన సమితిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మాజీ రాజ్యసభ సభ్యుడు వి.హనుమంతరావు, మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, మాజీ కార్పొరేటర్లు పులి జగన్, జీ. రమేశ్, లక్ష్మణ్‌యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉడిపి పలిమారు మఠం శ్రీ విద్యాధీశతీర్థస్వామి.. ఎమ్మెల్యేకు వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు. ఉదయం పూజలు, సాయంత్రం భజన, సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. గురువారం చివరి రోజు రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మేనేజర్ నర్సింహాచార్ పేర్కొన్నారు. ఈ ఆరాధనోత్సవాల్లో అధ్యక్షుడు కృష్ణమూర్తి, కార్యదర్శి బీపీ రఘువేంద్రరావు, అనంతమూర్తి, వెంకటేశ్ అడిగ, చంద్రశేఖర్, భక్తులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం

జ్యోతి ప్రజ్వలనం చేస్తున్న వ్యవస్థాపకుడు ఆది శ్రీనివాస్

రవీంద్రభారతి, ఆగస్టు 21: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ,స్వర మహతి కళాపరిషత్ సాంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సృజనోత్సవ్ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, మిరియాల రాఘవరావు, రమేశ్ గోరంట్ల, సీతాదేవి, భూపతి శ్రీనివాస్‌రావులు విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి సృజనోత్సవ్ -2024 జాతీయ స్థాయి ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవం, పీవీ శ్రీనివాస్‌రావుకు సేవారత్న అవార్డుల ప్రదానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వరమహతి కళాపరిషత్ వ్యవస్థాపకుడు ఆది శ్రీనివాస్ సభా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి అతిథులు విచ్చేసి మాట్లాడుతూ.. స్వర మహతి కళాపరిషత్ ప్రతి సంవత్సరం సృజనోత్సవం-2024 జాతీయ స్థాయి ప్రతిభ అవార్డులను ప్రదానోత్సవ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. అవార్డులు పొందిన వారిలో పీవీ శ్రీనివాస్‌రావును సేవారత్న అవార్డు, బోడపాటి శ్రీనివాస్‌రావును పేరిణి నృత్య అవార్డుతో సత్కరించారు. కేశవదాస్, కేదర్‌నాథ్, సంజీవులు,రచయిత కులశేఖర్, భాస్కరలక్ష్మి తదితరులను అవార్డులతో సత్కరించారు.

కలుషిత ఆహార పదార్థాల అడ్డా.. నాంపల్లి రైల్వేస్టేషన్!

- బల్లి పడిన ఆహారం తిన్న ప్రయాణికుడు..
- గుట్టుచప్పుడు కాకుండా వైద్యం అందించి తరలింపు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు

నాంపల్లి రైల్వేస్టేషన్ వద్ద నిర్వహిస్తున్న ఓ హోటల్

తెలుగు యూనివర్సిటీ, ఆగస్టు 21 : నాంపల్లి రైల్వే స్టేషన్ కేంద్రంగా పలు హోటళ్లు అపరిశుభ్రవాతావరణంలో కొనసాగుతున్నాయి. కలుషితమైన నీటితోపాటు నాసిరకం ఆహారపదార్థాలు వడ్డిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. మంగళవారం రాత్రి మహారాష్ట్రకు చెందిన ప్రయాణికులు సమీపంలోగల ఓ హోటల్‌లో ఆహారం తింటుండగా అందులో బల్లి కనిపించడంతో హోటల్ నిర్వాహకులను నిలదీయడంతో పాటు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించి కనీసం కేసు నమోదు చేయ కపోవడం శోచనీయం. కాగా .. బల్లిపడిన ఆహారం తిన్న ప్రయాణికుల్లో ఒకరు అస్వస్థతకు గురి కాగా దవాఖానలో వైద్య అందించి.. గుట్టుచప్పుడు కాకుండా పంపించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనిపై జీహెచ్‌ఎంసీ సర్కిల్ ఏఎంహెచ్‌ఓను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌లిఫ్ట్ చేయలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి.. హోటళ్లలో నిత్యం తనిఖీలు చేస్తూ, పరిశుభ్ర వాతావరణంలో ఆహార పదార్థాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కరాటే విద్యార్థులకు అభినందన

కరాటే మాస్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి, అమృతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడ,ఆగస్టు 21: బెంగళూర్‌లో నిర్వహించిన 10వ షోటోఖాన్ జాతీయ కరాటే పోటీల్లో బర్కత్‌పుర జీవీఆర్ కరాటే అకాడమీకి చెందిన విద్యార్థులు 33 బంగారు పతకాలు, 3 రజిత పతకాలు సాధించి చాంపియన్‌షిప్ కప్‌ను కైవసం చేసుకున్నారు. బుధవారం విద్యార్థులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అభినందించారు. భవిష్యత్‌లో మెరుగ్గా రాణించాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో కరాటే మాస్టర్ డాక్టర్ జీఎస్.గోపాల్‌రెడ్డి, అమృతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు పాతికేళ్ల తెలంగాణ సాహిత్య సదస్సు

రవీంద్రభారతి, ఆగస్టు 21: తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్ రచయిత, బీఎస్ రాములు 75 ఏండ్ల అమృతోత్సవాలు ఈ నెల 23న రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ అధ్యక్షుడు బి.నర్సింగరావు, కన్వీనర్లు డాక్టర్ సదాశివ్ కర్రె, కవయిత్రి జ్వలిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో బీఎస్ రాములు ప్రత్యేక ప్రసంగం ఉంటుందన్నారు. సాహితీప్రియులు పెద్ద ఎత్తున పాల్గొనాలని నిర్వాహకులు తెలిపారు.

దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

- డీఎస్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్

మహాధర్నాలో మాట్లాడుతున్న వీ. ప్రసాద్

చిక్కడపల్లి, ఆగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో చెప్పిన విధంగా దివ్యాంగులకు రూ.6000 పెన్షన్ పెంపు సహా ఇచ్చిన 7 హామీలను వెంటనే అమలు చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్(డీఎస్‌డీ) రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ అన్నారు. డీఎస్‌డీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చూస్తూ బుధవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు అనేక హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి 9 నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఒక్క హామీ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. చేయూత పథకం ద్వారా దివ్యాంగులకు పింఛన్లు రూ. 6 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం 2016ని పటిష్టంగా అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 5 శాతం దివ్యాంగులకు కేటాయించాలని కోరారు. ధర్నాలో డీఎస్‌డీ రాష్ట్ర కార్యదర్శి భారతి, ఉపాధ్యక్షుడు కె. వెంకటేశ్‌గౌడ్, నాయకులు, పెద్ద సంఖ్యలో దివ్యాంగులకు పాల్గొన్నారు.

కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో డీసీపీ తనిఖీలు

పీఎస్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీసీపీ బాలస్వామి

కాచిగూడ,ఆగస్టు 21: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల కేసుల పరిష్కారం కోసం పోలీసులు త్వరితగతిన న్యాయం చేయాలని ఈస్ట్‌జోన్ డీసీపీ డాక్టర్ బి.బాలస్వామి సూచించారు. బుధవారం కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ నర్సయ్యతో కలిసి డీసీపీ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో పెండింగ్ కేసులు, క్రైమ్ కేసుల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారులకు న్యాయం లభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిందితులకు శిక్షలు పడలాంటే ఏ కేసులు పెట్టాలి, నేరాల నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి, ఎలా పరిష్కరించాలి అనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో కాచిగూడ డివిజన్ ఏసీపీ రఘు, కాచిగూడ సీఐ చంద్రకుమార్, ఎస్సైలు హెచ్.నరేశ్, సుభాశ్, సురేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన నాయకులు

సహకార మజ్దూర్ యూనియన్ ఏర్పడి 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం కలిసి ప్లాటినం జూబ్లీ ఉత్సవాల మెమెంటోను అందజేసిన యూనియన్ నాయకులు ఆదిల్ షరీఫ్, తదితరులు. - అబిడ్స్, ఆగస్టు 21

ఆకట్టుకున్న పేరిణి నాట్య ప్రదర్శన

రవీంద్రభారతి, ఆగస్టు 21: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, న్యూయార్క్ తెలంగాణ తెలుగు సంఘం శ్రీమణిదీప్ప ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పేరిణి నాట్య పదం పరమ పరా-2 కార్యక్రమాన్ని బుధవారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, ఆత్మీయ అతిథిగా కృష్ణప్రదీప్, ద్వారకనాథ్‌రెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేరిణి నాట్యం అతి ప్రాచీనమైన శాస్త్రీయ నృత్యమని తెలిపారు. అనంతరం పేరిణి ప్రవీణ్, శ్రీగజ్జెల నవ్యజ రంజిత్‌కుమార్, పేరిణి సంతోష్, డాక్టర్ పేరిణి రవితేజ, నరుత్తంరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

మిస్టర్ అండ్ మిస్ జార్జియస్‌గా మ్యారీ సింతియా

సర్వైకల్ క్యాన్సర్ రోగులకు మద్దతుగా స్కూప్స్ అండ్ క్రీం స్టోన్ ఆధ్వర్యంలో బుధవారం మిస్టర్ అండ్ మిస్ జార్జియస్ ఆఫ్ ఇండియా-2024 పేరుతో నిర్వహించిన అందాల పోటీలో విజయం సాధించిన వై.మ్యారి సింతియా. పోటీల్లో పాల్గొన్న పలువురు మోడల్స్ మాట్లాడుతూ మహిళలు సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. - అబిడ్స్

రాఘవేంద్రస్వామిని దర్శించుకున్న కేంద్రమంత్రి

రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో భాగంగా బుధవారం కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి లింగంపల్లిలోని శ్రీ రఘవేంద్ర స్వామి బృందావన్ సమితి ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్‌యాదవ్, సుభాశ్‌పటేల్, క్షీర్‌సాగర్, కృష్ణకుమార్,అరవింద్,అశోక్‌కులకర్ణి, క్షీర్‌సాగర్, వాసు, తదితరులు పాల్గొన్నారు. - కాచిగూడ,ఆగస్టు 21

కన్నులపండువగా అమ్మవారి విగ్రహ పత్రిష్ఠాపన

అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు.

చిక్కడపల్లి,ఆగస్టు 21 : గాంధీనగర్‌లోని అరుంధతీనగర్ బస్తీలో శ్రీ మైసమ్మ అమ్మవారి విగ్రహ పత్రిష్ఠాపన మహోత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం గణపతిపూజ, పున్యాహవాచనం, కులశస్థాపన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు మెరుగు శ్రీనివాస్ యాదవ్, అన్నప్రదాత శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు తీగల శ్రీనివాస్ గౌడ్, కైరంకొండ నర్సింగ్ గంగపుత్ర, పి.యాదగిరి ముదిరాజ్, నాగుల ప్రకాశ్ గంగపుత్ర, దేవరాజ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత


విజయ్‌నగర్ కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు,సిబ్బంది

మెహిదీపట్నం ఆగస్టు 21: ప్రజలకు ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణాలు చేపట్టాలని,లేకపోతే కూల్చివేతలు తప్పవని జీహెచ్‌ఎంసీ సర్కిల్-12 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ కృష్ణమూర్తి అన్నారు. నాంపల్లి నియోజకవర్గం విజయ్‌నగర్ కాలనీలో అక్రమంగా నిర్మిస్తున్న భవనంలో అంతస్తులను జీహెచ్‌ఎంసీ సర్కిల్-12 టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చివేశారు. ఏసీపీ కృష్ణమూర్తి పర్యవేక్షణలో సెక్షన్ ఆఫీసర్ నర్సింగ్‌రావు, చైన్‌మెన్లు నర్సింగ్, మోహన్ సిబ్బందితో కూల్చివేతలు చేపట్టారు.

ఓటరు జాబితా సవరణపై నాయకులతో సమావేశం

ఓటరు లిస్ట్‌లో ఓటర్ల సవరణపై రాజకీయ పార్టీల నాయకుల అభిప్రాయాల సేకరణ కోసం బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్-13 కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ శశిరేఖ సమావేశం నిర్వహించారు. ఓటర్ల వివరాలపై ఓటరు లిస్ట్‌లో పలు మార్పులు, చేర్పులు చేయడానికి సమావేశం ఏర్పాటు చేశామని డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తెలిపారు. - మెహిదీపట్నం ఆగస్టు 21

రోడ్లకు మరమ్మతులు..

భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లకు జీహెచ్‌ఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టారు. నాంపల్లి నియోజకవర్గంలోని మెహిదీపట్నం, ఆసిఫ్ నగర్, మల్లేపల్లి డివిజన్లలో ప్రధాన రోడ్లపై పేరుకుపోయి ఇసుక, బురదను బుధవారం సిబ్బంది తొలగించారు. అలాగే గుంతలను పూడ్చారు. - మెహిదీపట్నం ఆగస్టు 21

త్వరలో పేయింగ్ రూమ్‌ల ఏర్పాటుకు శ్రీకారం

- సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో రోగులకు మెరుగైన వైద్యంఅందించడమే లక్ష్యం
- దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత

సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత

సుల్తాన్‌బజార్,ఆగస్టు 21: గర్భిణులకు మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్న కోఠిలోని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి దవాఖానలో త్వరలో రోగులకు మరిన్ని సేవలందించేందుకు పేయింగ్ రూమ్‌ల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. త్వరలోనే రోగుల సౌకర్యార్థం దవాఖాన ఆవరణలోని నూతన భవనంలో ఖాళీగా ఉన్న రూంలను పెయింగ్ రూంలుగా అందుబాటులోకి తీసుకువస్తామని దవాఖాన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. దవాఖానకు వచ్చే పేద గర్భిణులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

ఈ దవాఖాన బోధనాసుపత్రి పరిధిలోనిది కావడంతో కుటుంబ నియంత్రణ(ట్యూబెక్టమీ)చికిత్సలు అందుబాటులోకి తీసుకురావడంతో పీజీలకు శిక్షణ కల్పించేందుకు త గిన ప్రోత్సాహాన్ని అందిస్తున్నట్లు వివరించారు. రోగుల సౌకర్యార్థం పాత ఓపీ శిథిలావస్థకు చేరడంతో దవాఖాన ఆవరణలో నూతన భవనాన్ని నిర్మించారు. 2017లో ఈ భవనం నిర్మాణం పూర్తయింది. కాగా ఈ భవనం మూడంతస్థుల్లో ఉండటంతో నాటి డీఎంఈ ఈ భవనం ఓపీకి మాత్రమే కేటాయిస్తే ఎలా అని గ్రౌండ్ ఫ్లోర్‌లో తదితర వైద్యాధికారులతో కలిసి పర్యవేక్షించి లేబర్ రూమ్‌గా డిజైన్ చేసి.. అందులో లే బర్ రూమ్ కొనసాగేలా చేశారు. కాగా ఓపీ బ్లాక్ నిమిత్తం ఏర్పాటు చేసిన భవనంలో సుమారు పది గదులను గర్భిణులను పరిశీలించేందుకుగాను కౌన్సెలింగ్ నిమిత్తం నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో దవాఖానకు వచ్చిన ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత ఆ గదులను పెయింగ్ రూమ్‌లుగా అందుబాటులోకి తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారు.

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు సన్మానం

అడిక్‌మెట్ డివిజన్, విద్యానగర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేట్టిన కె.ప్రభును కళాశాల అధ్యాపక బృందం బుధవారం సన్మానించింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాటాడుతూ.. ఈ విద్యా సంవత్సరం కళాశాలకు అటానమస్ హోదా రావడం హర్షణీయమన్నారు. డిగ్రీ కళాశాలలో విద్యాబోధన, మౌలిక వసతుల కోసం ప్రభుత్వ భూమిని ఇవ్వాల్సిందిగా మరొకసారి కోరనున్నట్లు తెలిపారు. - ముషీరాబాద్, ఆగస్టు 21

'దళితబంధు' అమలులో అక్రమాలు

- అధికారులపై చర్యలు తీసుకోవాలని హెచ్‌ఆర్‌సీలో ఫిర్యాదు

హెచ్‌ఆర్‌సీ ఆవరణలో మీడియాతో మాట్లాడుతున్న బాధితురాలు లక్ష్మి

సుల్తాన్‌బజార్, ఆగస్టు 21 : గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన దళిత బంధు పథకం అమలులో అక్రమాలకు పాల్పడిన అధికారులపై విచారణ జరిపించాలని పలువురు దళిత మహిళలు బుధవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఫిర్యాదు అనంతరం హెచ్‌ఆర్‌సీ ఆవరణలో బాధితురాలు లక్ష్మి మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండలంలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకంలో లబ్ధిదారుల నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాంలాల్‌నాయక్ కమీషన్లు తీసుకొని అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీంతో నిజమైన లబ్ధిదారులకు కాకుండా తనకు ఎవరు కమీషన్ ఇచ్చారో వారికి పథకాలు వర్తించేలా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత పదేళ్ళుగా కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా తిష్ట వేసి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఎస్సీ హాస్టళ్లకు విడుదలయ్యే నిధులను కూడా స్వాహా చేస్తున్నారని ఆమె మండిపడ్డారు.

అక్రమంగా సంపాధించిన డబ్బుతో స్థానికంగా పెట్రోల్ పంపులతో పాటు ఫామ్‌హౌజ్‌లు నడుపుతున్నారని అన్నారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న రాంలాల్‌పై శాఖాపరమైన విచారణ చేస్తే వాస్తవాలు బయటికి వస్తాయని ఆమె కమిషన్‌ను కోరింది. దళిత బంధు విషయంలో అనేక అవకతవకలు జరిగాయని, ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని ఏసీబీ విచారణ జరపాలని ఆమె కోరారు.

త్వరలో డ్రైనేజీ కొత్త పైప్‌లైన్ ఏర్పాటు

గోల్నాక, ఆగస్టు 21 : అంబర్‌పేట డివిజన్ న్యూ పటేల్‌నగర్‌లో బుధవారం స్థానిక కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు.. కాలనీలో పర్యటించి కొత్త డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్పొరేటర్ వెంట జలమండలి ఏఈ మాజిద్‌తో పాటు బస్తీ వాసులు ఉన్నారు.

కొవ్వొత్తుల ర్యాలీ

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన అమానుషకాండను ఖండిస్తూ ఫలక్‌నుమా డిగ్రీ కళాశాల అధ్వర్యంలో విద్యార్థినులు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ కె. ప్రవీణ్ కుమార్, తదితరులు - అబిడ్స్, ఆగస్టు 21

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మెహిదీపట్నం : గోల్కొండకు చెందిన అమీనాబేగంకు సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ. 1.25 లక్షల చెక్కును బుధవారం కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ బాధితురాలి కుటుంబసభ్యులకు అందజేశారు. నిరుపేదలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

యువకుడి సెల్‌ఫోన్ అపహరణ.. నిందితులు అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకరయ్య

సుల్తాన్‌బజార్, ఆగస్టు 21: సోదరిని కలిసేందుకు నడుచుకుంటూ వెళ్తున్న ఓ యువకుడి ఫోన్‌ను లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను అఫ్జల్‌గంజ్ పోలీసులు అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సుల్తాన్‌బజార్ డివిజన్ ఏసీపీ శంకరయ్య, డీఐ మధుకుమార్, డీఎస్ఐ రామకిషన్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ నెల 16న విజయవాడకు చెందిన డిగ్రీ విద్యార్థి కంచర్ల సాయి వివేక్.. కోఠి ఈఎన్‌టీ సమీపంలో గర్ల్స్ హాస్టల్ నడుపుతున్న సోదరిని కలిసేందుకు వచ్చాడు. రాత్రి 12.30 గంటల ప్రాంతంలో ఎంజీబీఎస్‌లో బస్సు దిగి ఫోన్‌లో లొకేషన్ పెట్టుకొని నడుచుకుంటూ ఈఎన్‌టీ వైపు వస్తున్నాడు. గౌలిగూడ లైబ్రరీ ప్రాంతానికి రాగానే గుర్తు తెలియని ముగ్గురు యువకులు బైక్‌పై వచ్చి అతడి చేతిలోని ఫోన్‌ను లాక్కుని పోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టి.. నిందితులు మీర్‌పేట్ ప్రాంతానికి చెందిన సీహెచ్ కార్తిక్, డి. అజయ్‌ను అరెస్టు చేశారు. వారి నుంచి ఫోన్, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ లింగేశ్వర్‌రావు, డీఐ మధుకుమార్, డీఎస్ఐ రామ్‌కిషన్, క్రైం సిబ్బంది శ్రీకాంత్, యాసిన్ షరీఫ్, జితేందర్, సులేమాన్, శ్రీకాంత్,అబ్దుల్ ముజాహిద్‌ను ఏసీపీ శంకరయ్య అభినందించారు.

IN THE COURT OF THE HON'BLE I ADDL JUNIOR CIVIL JUDGE, CYBERABAD, R.R. DISTRICT, AT : RAJENDRA NAGAR O.S.NO. 67 OF 2012

Between:
Adirala Parmesh ...Plaintiff
AND
Balachander Vishwanath Valvekardied per Lr's & another ...Defendants
To
V.Sunil, S/o. Balachander Vishwanath Valveker, R/o. Block-II, Flat No. 1, MIG-II, Baghlingampally, Hyderabad ...(Defendant No.3).

Please take notice that the Plaintiff has filed the above suit and the Hon'ble Court was pleased to order summons to you through this publication and posted the above case to 23-08-2024 for your appearance at 10.30 am. If you fail to attend before Hon'ble Court in the above case in person or through your counsel on the said date and time, the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE HON'BLE COURT)
M/s. N. LALITHA REDDY, TS/3325/99,
Advocate
#2-2-72, Upper Pally, Rajendra Nagar (M), R.R. District, **Cell No. 9247817735.**